నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 ఖమ్మం, ఆదివారం 18 మే 2025 KHAMMAM



పరదాలపై నీటిని తొలగిస్తున్న రైతు

# అకాల వర్షంతో రైతుల అవస్థలు

- కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాసులను కాపాడుకునేందుకు పాట్లు
- ప్రభుత్వం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతున్న రైతులు

అన్నపురెడ్డిపల్లి, మే 17: అకాల వర్షాలతో అన్నదాతలు అతలాకుతలమవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. మండలవ్యాప్తంగా శనివారం కురిసిన భారీ వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యపు రాసులను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. అప్పటికప్పుడు పట్టాలు కప్పి ధాన్యాన్ని తడవకుండా చేసుకున్నారు. వర్షం తగ్గిన తర్వాత పట్టాలపై, ధాన్యపు రాసుల చుట్టూ చేరిన నీటిని తొలగించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. అధికారులు సకాలంలో ధాన్యం కొనుగోలు చేస్తే ఇన్ని ఇబ్బందులు ఉండేవి కాదని, ఇప్పటికైనా కొనుగోళ్లు ముమ్మరం చేయాలని రైతులు కోరుతున్నారు. మరికొద్ది రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.



వర్షపు నీటికి తడవకుండా ధాన్యపు రాశి చుట్టూ బస్తా సరిచేస్తున్న రైతులు

# 14న జాతీయ లోక్ అదాలత్

**పోలీసులు, న్యాయవాదుల సమీక్షలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్**



పోలీసులు, ఇన్సూరెన్స్ కంపెనీల న్యాయవాదుల సమీక్షలో మాట్లాడుతున్న జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెం టౌన్, మే 17: జూన్ 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. కొత్తగూడెంలోని జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి.. రాజీపడదగిన పెండింగ్ క్రిమినల్ కేసులు, ఈ పిటీ కేసుల వివరాలను ఠాణాలవారీగా అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని, బీమా కంపెనీల ప్రతినిధులు తమ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలన్నారు. మోటార్ వాహన ప్రమాద బాధితుల కేసులలో కక్షిదారులకు న్యాయం జరగాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీపడడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు వృథా కాదన్నారు. సమావేశంలో జడ్జిలు సాయిశ్రీ, మెండు రాజమల్లు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాగం మాధవరావు, పీపీ పీవీడీ లక్ష్మి ఏపీపీలు, పోలీస్ అధికారులు, సీఐడీసీ ఆర్‌బీ, టూటౌన్ ఎస్‌హెచ్‌వో రమేశ్‌కుమార్, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.







**అధికార పార్టీ నేతల పట్టు?**

మున్సిపాలిటీగా ఏర్పాటై మూడు నెలలు ముగిసినా మున్సిపల్ వార్డులు సిద్ధం కాలేదు. ఇంకా పంచాయతీల ద్వారానే, పంచాయతీ కార్యాలయాల పేరుమీదే పౌర సేవలు అందుతున్నాయి. అయితే ఇందుకు ఓ బలమైన కారణం ఉందంటూ విలీన పంచాయతీల ప్రజలు చర్చించుకుంటున్నారు. భవిష్యత్తులో ఏదులాపురం మున్సిపాలిటీకి ఎన్నికలు జరిగే తాము విజయం సాధించేందుకు అవకాశం ఉండే విధంగా తమ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలను కలిపి ఒక మున్సిపల్ వార్డుగా విభజించాలని, అందుకు విరుద్ధంగా జరిగే వార్డుల విభజనను తాము జరగనివ్వబోమని శపథం చేస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

- ఏదులాపురం మున్సిపాలిటీకి వంద రోజులు పూర్తి
- ఇంకా పాత పంచాయతీల యూనిట్‌గానే పాలన
- మున్సిపల్ ఎన్నికలు పెడితే గెలుపు కోసం కాంగ్రెస్ నేతల ప్లాన్?
- అందుకోసం ఇప్పటి నుంచే అనుకూల వార్డుల కోసం ఎత్తుగడ?
- తమ ప్రాబల్య ప్రాంతాలను ఫలానా వార్డు చేయాలంటూ పట్టు?
- అందువల్లనే మూడు నెలలైనా కొలిక్కిరాని వార్డుల విభజన?

# పేరు పురపాలకం.. పాలన పంచాయతీ

- కానీ మున్సిపల్ వార్డులపై స్పష్టత కరువు
- గ్రామ యూనిట్‌గానే పథకాల లబ్ధిదారుల ఎంపిక
- పనులకు దూరమైన ఉపాధి హామీ పథకం కూలీలు

**'పాత సీసాలో కొత్తసారా' అనే సామెతలా ఉంది ఏదులాపురం మున్సిపాలిటీ తీరు. పురపాలక సంఘంగా ఏర్పడి వంద రోజులు దాటినా పాలన మాత్రం పంచాయతీల్లోనే సాగుతోంది. మీరు పట్టణ పరిధిలోకి వెళ్లారు కాబట్టి మీకు ఉపాధి హామీ పథకం వర్తించదు. అందుకని మీకు కూలి పనులు కల్పించలేం' అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రాజీవ్ యువ వికాసం, ఎల్ఆర్ఎస్ పథకాలను మాత్రం పంచాయతీల పేరుమీదే అమలు చేస్తోంది. దీంతో ఓ వైపు రోజువారీ పనులు కోల్పోయి ఉపాధి కూలీలు, మరోవైపు తాము గ్రామీణ ప్రజలమా? లేక పట్టణ ప్రజలమా? అనే మీమాంసలో విలీన పంచాయతీల ప్రజలు డైలమాలో ఉన్నారు. ఫలితంగా ఆయా పథకాల లబ్ధిని పొందలేకపోతున్నారు. ఇక పౌర సేవలు అందించే అధికారులదీ అదే తీరు కన్పిస్తోంది. పన్నెండు పంచాయతీలకు కలిపి ఏర్పాటుచేసిన ఏదులాపురం మున్సిపాలిటీలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి వచ్చిన ఒకరిద్దరు మినహా మిగతా అధికారులందరూ ఆయా విలీన (పాత) పంచాయతీలవారే. అదీగాక, పురపాలకంగా ఏర్పడి వంద రోజులు దాటుతున్నా పౌర సేవలు మాత్రం పంచాయతీల మీదనే అదే పంచాయతీల కార్యాలయాల్లోనే సాగుతుండడం గమనార్హం. చివరికి మున్సిపల్ వార్డులుగా ఉండాల్సిన బోర్డులు ఇంకా పంచాయతీలుగానే దర్శనమిస్తుండడం విశేషం.**

**–ఖమ్మం రూరల్, మే 17**



ఈ ఏడాది జనవరి చివరిలో ఖమ్మం రూరల్ మండలంలోని పన్నెండు పంచాయతీలను కలుపుకొని ఏదులాపురం పేరుతో నూతన మున్సిపాలిటీని ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. పాలేరు నియోజకవర్గంలోనే తొలి మున్సిపాలిటీ కావడంతో సహజంగానే ఇక్కడి ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. తొలుత ఏదులాపురం పంచాయతీ కేంద్రంగా ఒక నెలపాటు అక్కడి పంచాయతీ కార్యాలయాన్నే మున్సిపాలిటీ కార్యాలయంగా ఏర్పాటు చేసి పాలనకు శ్రీకారం చుట్టింది రేవంత్ సర్కారు. తరువాత కొద్ది రోజులకు పెద్దతండా పంచాయతీ కార్యాలయం కేంద్రంగా మున్సిపాలిటీ ఉంటుందని ప్రకటించింది. అధికారులు కూడా అక్కడి నుంచి పాలనా వ్యవహారాలు ప్రారంభించారు. నూతన మున్సిపాలిటీ ఏర్పాటైన సమయంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను పునరుద్ధరించింది. దీంతో మున్సిపల్ కమిషనర్, సిబ్బంది కలిసి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్ఆర్ఎస్‌పైనే దృష్టి సారించారు. పంచాయతీ పోర్టల్ నుంచి మున్సిపల్ పోర్టల్‌కు ఇంటి నంబర్లు సహా పూర్తి డాటా విభజన ఆలస్యం కావడంతో మిగతా పనులను పక్కను పెట్టి కేవలం ఎల్ఆర్ఎస్‌పైనే అధికారులు దృష్టి సారించారు. దీనికితోడు ఇంటి పన్నుల వసూళ్ల కోసం ఆన్‌లైన్ వ్యవస్థ అందుబాటులోకి రాకపోయినప్పటికీ మాన్యువల్‌గా ఇంటి పన్నులు కట్టించుకున్నారు. ప్రధానంగా ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం.. మున్సిపల్ పాలన వ్యవహారాలను మాత్రం పూర్తిస్థాయిలో చేపట్టలేకపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### నేటికీ స్పష్టత కరువు

పురపాలక సంఘం అంటేనే మున్సిపల్ వార్డుల ద్వారా పాలన సాగాలి. అభివృద్ధి, సంక్షేమ పథకాలూ ఆయా మున్సిపల్ వార్డుల యూనిట్‌గానే అమలుకావాలి. కానీ ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటై వంద రోజులు గడిచినా మున్సిపల్ వార్డుల అంశంపై స్పష్టత లేదు. అయితే వార్డుల ఏర్పాటుకు సంబంధిత అధికారులు తొలినాళ్లలోనే శ్రీకారం చుట్టారు. పాత పంచాయతీల్లోని బీఎల్‌వోలతో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వార్డుల ఏర్పాటు ప్రక్రియను చేపట్టారు. మొత్తం 32 మున్సిపల్ వార్డుల ఏర్పాటు జరిగినట్లు లీకులు కూడా వచ్చాయి. అంతలోనే అధికార పార్టీ నేతల ఒత్తిడితో ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో మున్సిపల్ వార్డుల ఏర్పాటు అధికారికంగా ప్రకటించలేదు. దీంతో ఇటీవలి ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, రేషన్‌కార్డుల వంటి పథకాల ప్రక్రియ పాత పంచాయతీల యూనిట్‌గా సాగింది. దీంతో తమకు ఆయా ప్రభుత్వ పథకాలు పంచాయతీల నుంచి అందుతాయో లేక పట్టణం నుంచి అందుతాయో అనేది అంతుచిక్కక విలీన పంచాతీయల ప్రజలు తలలు పట్టుకుంటున్నారు.

**పంచాయతీలో వేతనాలు.. మున్సిపాలిటీలో సేవలు**

ఖమ్మం రూరల్ మండలంలోని పన్నెండు పంచాయతీల సెక్రటరీలతోనే ఏదులాపురం మున్సిపాలిటీ నిర్వహణ కొనసాగుతోంది. మున్సిపాలిటీ అనే పేరు కేవలం రికార్డుల్లో కన్పిస్తోంది. అంతేతప్ప క్షేత్రస్థాయిలో దాని మార్క్ కనిపించడం లేదు. ఈ మూడు నెలలుగా ఆ పన్నెండు గ్రామాల కార్యదర్శులు, ఇతర సిబ్బంది పంచాయతీ రాజ్ శాఖ నుంచి వేతనాలు, ఇతర సదుపాయాలు పొందుతున్నారు. కానీ విధులు మాత్రం మున్సిపాలిటీ నుంచి నిర్వహిస్తున్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఇన్‌చార్జులుగా వచ్చిన ఒక్కరిద్దరు తప్ప మిగిలిన వారంతా పాత పంచాయతీల అధికారులే. అయితే, ఉపాధి పనులు అడిగినప్పుడు 'మీది మున్సిపాలిటీ కాబట్టి పనులివ్వడం కుదరదు' అంటున్న ప్రభుత్వం.. ఎల్ఆర్ఎస్, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల వంటి పథకాలను పంచాయతీల పేరుతోనే తమకెందుకు అందిస్తున్నారు? అంటూ ప్రశ్నిస్తున్నారు విలీన పంచాయతీల ప్రజలు.

# 'సీఎంఆర్ఎఫ్' ఆంక్షలతో కష్టాలు

- దవాఖానలో ఎంత ఖర్చు చేసినా రూ.60 వేలకు మించి ఇవ్వట్లే..
- కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్న రాష్ట్ర ప్రజలు
- బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు
- 73 మందికి రూ.19.16 లక్షల విలువగల చెక్కులు పంపిణీ



ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు

ఖమ్మం, మే 17: కాంగ్రెస్ పాలనలో సీఎంఆర్ఎఫ్‌లో ఆంక్షలు విధిస్తుండడంతో పేదలు వైద్యం చేయించుకునేందుకు నానా కష్టాలు పడుతున్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కనీసం కనికరం కూడా చూపడం లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. ఖమ్మం తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తన సిఫార్సు మేరకు మంజూరైన రూ.19.16 లక్షల విలువ కలిగిన 73 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్న వారి పరిస్థితిని అర్థం చేసుకుని వెనువెంటనే ఆర్థిక సాయం అందించారని గుర్తు చేశారు. కానీ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ విషయంలో ఆంక్షలు పెడుతున్నదని, ప్రైవేటు ఆసుపత్రులలో ఎంత ఖర్చు చేసినా రూ.60 వేలకు మించి ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, మళ్లీ కేసీఆర్ పాలనను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేతకాక చేతులెత్తేసిందన్నారు. 420 హామీలు అమలు చేయలేక కేసీఆర్‌పై నిందలు మోపుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఆదాయం లేదని చెబుతున్న రేవంత్‌రెడ్డి మరి హామీలు ఎందుకు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ప్రజలందరూ అదే కోరుకుంటున్నారని మధు అన్నారు. బీఆర్ఎస్ మైనార్టీ విభాగం జిల్లా నాయకుడు షేక్ తాజుద్దీన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కనగాల వెంకటరావు, వాచేపల్లి లక్ష్మీరెడ్డి, భాషబోయిన వీరన్న, కారుమూరి వెంకటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, సత్తుపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ మహేష్, కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్, నాయకులు పోట్ల శ్రీనివాసరావు, ధనాల శ్రీకాంత్, పోట్ల ప్రసాద్, ప్రదీప్, మహ్మద్ రఫీ, ధర్మ, ఇటికల శ్రీను, తాతా ప్రసాద్, అశోక్, లింగనబోయిన సతీశ్, పేరం వెంకటేశ్వర్లు, చామకూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలి

- ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి
- వసతుల పరిశీలనలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



వీధి వ్యాపారుల ప్రాంగణంలో వ్యాపారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం, మే 17: మౌలిక వసతుల కల్పనలో రాజీ పడకుండా ప్రజలకు అసౌకర్యం కలగకుండా వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని, అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. శనివారం ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూరగాయలు అమ్మే షెడ్డులు, స్టాల్స్ చూస్తూ ప్రాంగణం మొత్తం కలియతిరుగుతూ వ్యాపారులతో ముచ్చటించారు. గత మార్చి 12వ తేదీన కలెక్టర్ వీధి వ్యాపారాల ప్రాంగణాన్ని తనిఖీ చేసిన సందర్భంగా కూరగాయల వ్యాపారులు తమకు సరిపడా షెడ్లు లేవని, లైటింగ్ ఏర్పాటు చేయాలని, వర్షం పడితే బురదమయం అవుతోందని, టాయిలెట్లు కూడా లేవని సమస్యలను ఏకరవు పెట్టుకున్నారు. దీంతో కలెక్టర్ స్పందించి యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులను మొదలుపెట్టించారు. వీధి వ్యాపారుల ప్రాంగణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. నిర్ణీత గడువులోగా నాణ్యతలో రాజీపడకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. చెత్త, కూరగాయల వ్యర్థాలు ఉండకుండా శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ వీధి వ్యాపారులకు సూచించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, ఇతర అధికారులు ఉన్నారు.

# పశువుల అక్రమ రవాణా జరిగితే సమాచారమివ్వండి

- వాహనాలను అడ్డుకుంటే కఠిన చర్యలు
- జిల్లా కేంద్రాల్లోనూ ఆకస్మిక తనిఖీ చేస్తాం
- ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



ఖమ్మం, మే 17: పశువుల అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఏ సంస్థలు, కార్యకర్తలు ఇతరులు ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి వాహనాలను స్వయంగా అడ్డుకుంటే కఠినచర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల రవాణా విషయంలో వివాదాలు తలెత్తకుండా ఏడు చెక్‌పోస్టుల ద్వారా పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పశువులను రవాణా చేసే ప్రతి వాహనానికి తగిన పత్రాలను పరిశీలిస్తున్నట్లు స్పష్టం చేశారు. అక్రమ రవాణాను నియంత్రించేందుకు నిఘా విభాగం అప్రమత్తంగా ఉంటుందని, చెక్‌పోస్టుల తనిఖీలే కాకుండా జిల్లా కేంద్రంలో సైతం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా అవసరమైన చోట్ల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# చేపల పెంపకానికి తెలంగాణ నీరు అనుకూలం

**శిక్షణ కార్యక్రమంలో మత్స్యశాఖ శాస్త్రవేత్త శాంతన్న**



శిక్షణ పొందిన మత్స్యరైతులతో మత్స్యశాఖ శాస్త్రవేత్తలు

కూసుమంచి, మే 17: చేపల పెంపకానికి తెలంగాణ నీరు చాలా అనుకూలమైందని, అధిక దిగుబడులు వస్తాయని, ఇక్కడి చేపలకు ఇతర ప్రాంతాల్లో మంచి మార్కెట్ ఉంటుందని మత్స్యశాఖ శాస్త్రవేత్త శాంతన్న అన్నారు. పీవీ నర్సింహారావు పశు వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రంలో శనివారం మూడో రోజు చేపల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో శాంతన్న మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు తెలుసుకుంటే మంచి లాభాలు వస్తాయన్నారు. శిక్షణ ముగింపులో రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. శాస్త్రవేత్తలు రవీందర్, శివనాగరాజు, తాటికొండ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# వృత్యంతర శిక్షణ మొదటి దశ పూర్తి

- హాజరుపై పకడ్బందీగా వ్యవహరించిన అధికారులు
- మే 27 నుంచి 31 వరకూ చివరి దశ శిక్షణ

ఖమ్మం అర్బన్, మే 17: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన వృత్యంతర శిక్షణ మొదటి దశ కార్యక్రమం ముగిసింది. కాగా మరో 2 విడతల శిక్షణ కార్యక్రమాలకు ఉపాధ్యాయుల సంఖ్య ప్రాతిపదికన జిల్లా కేంద్రంలోని హార్వెస్ట్ పాఠశాలతోపాటుగా న్యూవిజన్, న్యూఇరా పాఠశాలలను డీఈవో సత్యనారాయణ ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మే 20 నుంచి 24వరకు సదరు 3 కేంద్రాల్లో 2వ దశ శిక్షణ ప్రారంభం కానున్నదని, సదరు కేంద్రాల్లో ఉపాధ్యాయులకు సరిపడా మౌలిక వసతులు కల్పిస్తామని, చివరి 3వ దశలో మే 27 నుంచి మే 31 వరకు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

**'నమస్తే' కథనానికి స్పందన**

బడిపిల్లల్లా ఎగ్గొడుతున్న కొద్దిమంది ఉపాధ్యాయులు అనే శీర్షికన శుక్రవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వెలువడిన కథనంతో జిల్లా విద్యాశాఖ అప్రమత్తమైంది. శుక్ర, శనివారం హార్వెస్ట్ పాఠశాలలో శిక్షణ పొందుతున్న ప్రతి తరగతి గదిలో ఉపాధ్యాయుల హాజరును స్వయంగా సెక్టోరియల్ అధికారులు పర్యవేక్షించారు. శిక్షణ ప్రారంభ సమయం నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉపాధ్యాయులు ఉండేలా పకడ్బందీగా వ్యవహరించారు. మధ్యాహ్న భోజన సమయంలో సైతం ఉపాధ్యాయులు ఇంటిబాట పట్టకుండా అధికారులు సమన్వయం చేసి హాజరు పెంపునకు కృషి చేశారు.

# పాఠశాలల పునఃప్రారంభానికి.. ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలి

- విద్యా నాణ్యత పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలి
- మండలస్థాయి కార్యాచరణ అమలులోపాలను సరిదిద్దాలి
- టీచర్ల శిక్షణ పరిశీలనలో సైట్ డైరెక్టర్, అబ్జర్వర్ విజయలక్ష్మీబాయి



డీఈవో, సెక్టోరల్‌తో సమీక్ష చేస్తున్న సైట్ డైరెక్టర్, అబ్జర్వర్ విజయలక్ష్మీబాయి

ఖమ్మం అర్బన్, మే 17: విద్యా సంవత్సరం పునఃప్రారంభానికి విద్యాశాఖలోని ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని సైట్ డైరెక్టర్, అబ్జర్వర్ విజయలక్ష్మీబాయి అన్నారు. శనివారం ఖమ్మం నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో జరుగుతున్న శిక్షణా తరగతులను పరిశీలించి, ఎంఈవోలు, సెక్టోరల్స్‌తో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. మొదటి స్పెల్ శిక్షణా తరగతులు శనివారంతో ముగియడంతో ఉత్తమ శిక్షకులను ఎంపిక చేసి సన్మానించారు. తొలుత ఉన్నతాధికారులతో జూమ్ సమావేశంలో పాల్గొని జిల్లాలోని ట్రైనింగ్, డైట్ నిర్మాణాలు, యూనిఫాం వంటి వివరాలను వివరించారు. అనంతరం డీఈవో సామినేని సత్యనారాయణతో కలిసి సెక్టోరల్స్, ఎంఈవోలతో సమీక్ష చేశారు. బడిబాట, పాఠ్యపుస్తకాల సరఫరా, ఏకరూప దుస్తుల సంసిద్ధత, ఐఈపీల పనితీరు, అవసరమైన మరమ్మతులు తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. గతంలో జిల్లా విద్యాశాఖాధికారిగా మూడేళ్లు పనిచేసిన అనుభవంతో జిల్లాపై ఉన్న పట్టుతో ప్రతి అంశంపై చర్చించారు. ప్రతి ఎంఈవో మండలంలోని పాఠశాలల వారీగా నమోదు–విద్య నాణ్యత పెంచేందుకు సమర్థంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించవలసిందిగా ఆదేశించారు. ప్రతి నెల తప్పనిసరిగా ఉపాధ్యాయుల సమీక్ష సమావేశం మండలస్థాయిలో నిర్వహించి కార్యాచరణ ప్రణాళిక అమలును సమీక్షించి లోపాలను సరిదిద్దుకుంటూ పునఃప్రణాళిక రచన చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాజశేఖర్, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.